క్లుప్తంగా

ఉపాధ్యాయ సంఘాల నిరసన



నెల్లూరు (టౌన్): ఉపాధ్యాయ బదిలీల్లో అన్ని ఖాళీలను చూపించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు డీఈఓ కార్యాలయం ఎదుట సోమవారం రాత్రి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ ఖాళీలను బ్లాక్‌లిస్ట్‌లో ఉంచడం వల్ల ఉపాధ్యాయులకు నష్టం జరుగుతుందన్నారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శేషు, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రాజమనోహర్, ఏపీటీఎఫ్ 257 జిల్లా అధ్యక్షుడు దశరథరాములు, ఏపీటీఎఫ్ 1938 జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, బీటీఏ జిల్లా కార్యదర్శి రమేష్, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమణయ్య, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటరాజు, పీఈటీ రాష్ట్ర నాయకులు పీటర్‌థామస్, అపస్ నాయకులు రమేష్; హెచ్‌ఎంఏ జిల్లా ప్రధాన కార్యదర్శి చలపతి పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో అనుమానితుడు

నెల్లూరు(క్రైమ్): టీడీపీ నేతపై దాడికి యత్నించారన్న ఘటనలో సైదాపురానికి చెందిన ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ఆదివారం షార్ కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఆనం వెంకట రమణారెడ్డిపై కొందరు దాడికి యత్నించిన విషయం విదితమే. దుండగులు ఘటనా స్థలంలో రెండు బైక్‌లను వదిలివెళ్లారు. వాటి నంబర్ ప్లేట్ల ఆధారంగా వేదాయపాళెం పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు. ఓ బైక్ సైదాపురానికి చెందిన వ్యక్తిదిగా తేలడంతో సోమవారం అతన్ని అదుపులోకి తీసుకున్నారు. విచారించగా తనకు ఏమి తెలియదని చెప్పుకొచ్చినట్లు తెలిసింది. మరో బైక్‌కు నంబర్ ప్లేట్ లేకపోవడంతో ఇంజిన్ నంబరు ఆధారంగా వివరాలు సేకరించేందుకు రవాణాశాఖ అధికారులను సంప్రదించినట్లు సమాచారం.

నిందితులపై చర్యలు తీసుకోవాలి

టీడీపీ నేత ఆనం వెంకటరమణారెడ్డిపై దాడికి యత్నించిన నిందితులపై చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ నేతలు ఎస్పీ కే తిరుమలేశ్వర రెడ్డిని కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీకి వారు వినతి పత్రం సమర్పించారు. ఎస్పీని కలిసిన వారిలో మాజీ మంత్రి దేవినేని ఉమ, ఆనం వెంకటరమణారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, సునీల్, తదితరులు ఉన్నారు.

సచివాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

• డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి



మనుబోలు: సచివాలయాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి అన్నారు. మనుబోలు, పిడూరు సచివాలయాలను సోమవారం ఆయన సందర్శించి రికార్డులు పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏ లక్ష్యంతో సచివాలయాలను ప్రారంభించిందో అది నెరవేరేలా సేవలందించాలన్నారు. ఆధార్ నమోదు చేసుకుని పదేళ్లు దాటిన వారు తమ వివరాలను అప్‌డేట్ చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ చిన్నారుల బరువులను క్రమం తప్పకుండా పరిశీలించి వారి ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా పోలీస్, అంగన్‌వాడీ కార్యకర్త, ఏఎన్‌ఎం ఒక బృందంగా ఏర్పడి అంగన్‌వాడీల్లో చిన్నారులకు జనన ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయించి ఆధార్ నమోదు చేయించాలని సూచించారు.

గ్యాస్ లీకై వంట సామగ్రి దగ్ధం

బుచ్చిరెడ్డిపాళెం: సిలిండర్ నుంచి గ్యాస్ లీకై మంటలు వ్యాప్తి చెందడంతో వంట సామగ్రితో పాటు ఇంటి పైభాగం దెబ్బతిన్న ఘటన నగర పంచాయతీ పరిధిలోని ఖాజానగర్‌లో సోమవారం చోటు చేసుకుంది. బాధితురాలు రిహానా కథనం మేరకు.. రిహానా వంట చేస్తుండగా సిలిండర్‌లోని గ్యాస్ అయిపోవడంతో మరో సిలిండర్‌ను మార్చారు. స్టౌ ఆఫ్ చేయకుండా సిలిండర్ మార్చడంతో గ్యాస్ లీకైంది. దీనిని గుర్తించకుండా లైటర్ వెలిగించడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. రిహానా బయటకు పరుగు తీయగా మంటలు వ్యాపించాయి. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రిహానా ఇంట్లోని వంట పాత్రలు పూర్తిగా దగ్ధమయ్యాయి.

రేషన్ దుకాణంపై విజిలెన్స్ దాడులు

బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ పరిధిలోని ఖాజానగర్‌లోని ఐదో నంబర్ రేషన్ దుకాణంపై విజిలెన్స్ అధికారులు సోమవారం రాత్రి దాడులు జరిపారు. దుకాణ యజమాని పరమేశ్ అవకతవకలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదు రావడంతో దాడులు జరిపినట్లు సీఐ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. దుకాణంలో బియ్యం స్టాక్ 30 బస్తాలు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామని, దీనిపై కేసు నమోదు చేశామని చెప్పారు. సివిల్ సప్లయ్స్ అధికారి మురళి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవ్వాలి

• కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(బారకాసు): ప్రతి జీవికి జీవనాధారమైన ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, పర్యావరణ పరిరక్షణా చర్యల్లో ప్రజలు భాగస్వాములు కావాలని కలెక్టర్ హరినారాయణన్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, నగర పాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో 'పర్యావరణ హిత జీవనశైలి'పై నగరంలో అవగాహన ర్యాలీని శనివారం నిర్వహించారు. వీఆర్సీ మైదానంలో ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆర్టీసీబస్టాండ్ మీదుగా కేవీఆర్ పెట్రోల్‌బంక్, కస్తూర్బా కళాక్షేత్రం వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న వారితో కలెక్టర్ పర్యావరణ హిత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణంపై అవగాహన, సమస్యల పరిష్కారానికి ఐక్యరాజ్య సమితి ఏటా జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని జరపాలని తీర్మానం చేసిందని తెలిపారు. గ్లోబల్ వార్మింగ్, వాయు కాలుష్యం, ప్లాస్టిక్ వాడకం, తదితర ప్రధాన పర్యావరణ సమస్యలపై కార్యచరణకు ఏటా 143 దేశాలను పర్యావరణ దినోత్సవంలో భాగస్వాములయ్యేలా చర్యలు తీసుకుందని వివరించారు. పర్యావరణంపై ప్రజల్లో అవగాహన పెంచడానికి ఏటా ప్రత్యేక థీమ్‌తో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగానే పర్యావరణ హిత జీవనశైలి(లైఫ్) పేరుతో ర్యాలీని చేపడుతున్నామని తెలిపారు. వాతావరణంలో వచ్చే మార్పులు, ప్రకృతి వైపరీత్యాలు, భూకంపాలు, సునామీలు, అగ్నిపర్వతాలు, ఇండస్ట్రీయల్ పొల్యూషన్‌తో మానవాళిపై పెనుప్రభావం పడుతోందని, ప్రజలు తమ వంతు బాధ్యతగా భావించి కాలుష్య నియంత్రణ చర్యలు పాటించాలని కోరారు. కమిషనర్ వికాస్‌మర్మత్ మాట్లాడుతూ సమస్త జీవవాళి మనుగడకు అవసరమైన పర్యావరణాన్ని పరిరక్షించుకుని, రాబోయే తరాలకు ఆరోగ్యమైన భవిష్యత్తును అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలను ప్రతిఒక్కరూ బాధ్యతగా పాటించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం పెంచడంతో పాటు కాలుష్య రహిత సమాజ నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములయ్యేలా కార్యచరణ ప్రణాళికను రూపొందిస్తామని వెల్లడించారు. కాలుష్య నియంత్రణ మండలి ఈఈ రాజశేఖర్, డీఎఫ్‌ఓ చంద్రశేఖర్, నగర పాలక సంస్థకు చెందిన అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, అటవీశాఖ సిబ్బంది, గ్రామ, వార్డు సచివాలయాల కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.



పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

పర్యావరణాన్ని కాపాడుకుందాం

నెల్లూరు(అర్బన్): పర్యావరణాన్ని కాపాడుకుందామని ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ వెంకటప్రసాద్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ ఆవరణం, సమీప వీధుల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూతాపాన్ని తగ్గించేందుకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. ప్లాస్టిక్ సంచులకు బదులుగా వస్త్రసంచులు వినియోగించాలని సూచించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామని వైద్యసిబ్బందితో ప్రమాణం చేయించారు. ఎన్‌సీడీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్‌కుమార్, డెమో అధికారి శ్రీనివాసరావు, ఏఓ రామగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

నెల్లూరు(వీఆర్సీసెంటర్): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ఏపీఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ వెంకటసుబ్బయ్య అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నగరంలోని విద్యుత్‌భవన్‌లోని స్కాడా కార్యాలయంలో నెల్లూరుటౌన్ ఈఈ సోమశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్‌ఈ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజలను చైతన్యవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మిషన్ లైఫ్ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. అందులో భాగంగా పర్యావరణ పరిరక్షణకు విద్యుత్ ఉద్యోగులు కృషి చేయాలన్నారు. విద్యుత్ ఆదాకు ఎల్‌ఈడీ బల్బులు వినియోగించాలని, ఫ్రిజ్‌లు, ఏసీల వాడకాన్ని తగ్గించాలని కోరారు. స్టార్ రేటింగ్ కలిగిన ఎలక్ట్రికల్ గృహోపకరణాల వినియోగంతో విద్యుత్ ఆదాతో పాటు కాలుష్య ప్రభావాన్ని తగ్గించవచ్చని తెలిపారు. మొక్కలను పెంచాలని, ప్లాస్టిక్ కవర్లను నిషేధించాలని కోరారు. అనంతరం విద్యుత్‌శాఖ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈఈలు బాలచంద్ర, రాఘవేంద్రం, బెనర్జీ, డీఈఈలు, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ హిత జీవనశైలిని అలవర్చుకోవాలి

నెల్లూరు(అర్బన్): పర్యావరణానికి హాని కలిగించని జీవన విధానాన్ని ప్రతిఒక్కరూ అలవర్చుకోవడం ద్వారా పర్యావరణ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని భారత ప్రభుత్వ క్షేత్ర ప్రచారఅధికారి పరవస్తు నాగసాయిసూరి పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ నెల్లూరు క్షేత్ర కార్యాలయం, అటవీ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని నారాయణ నర్సింగ్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, ప్లాస్టిక్‌ను నిషేధించాలని పిలుపునిచ్చారు. డీఎఫ్‌ఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ జిల్లా అటవీశాఖ తరుపున గ్రీన్‌కార్డు మెంబర్‌షిప్ మొదలు పెడుతున్నామన్నారు. ఎవరైనా మొక్కలు నాట వచ్చన్నారు. అనంతరం విద్యార్థులు, వైద్య, అటవీశాఖ సిబ్బందితో పర్యావరణ పరిక్షణకు పాటు పడుతామని ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల ఆవరణంలో మొక్కలు నాటారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్, చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ మాధవి, నారాయణ డెంటల్ కళాశాల హెచ్‌ఓడీ డాక్టర్ కన్నన్, తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్‌భవన్‌లో మాట్లాడుతున్న ఎస్‌ఈ వెంకటసుబ్బయ్య



మొక్కలు నాటుతున్న ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ వెంకటప్రసాద్



మాట్లాడుతున్న పరవస్తు నాగసాయిసూరి



ఎస్‌బీఐ ఆధ్వర్యంలో..

నెల్లూరు(మినీబైపాస్): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నెల్లూరు రీజనల్ మేనేజర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రంగనాయకులపేట నుంచి నెల్లూరు బ్యారేజ్ వరకు సోమవారం పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.

గుర్తింపు కలిగిన పాఠశాలల్లోనే చేర్పించాలి

నెల్లూరు రూరల్: అర్బన్, రూరల్ పరిధిలోని ప్రభుత్వ గుర్తింపు కలిగిన ప్రైవేట్ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలని నెల్లూరు ఎంఈఓ తిరుపాల్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు తమ గుర్తింపు పత్రాలను నోటీసు బోర్డుల్లో తప్పనిసరిగా ప్రదర్శించాలన్నారు. అనుమతులు లేకుండా పాఠశాలల్లో ప్రవేశాలు జరిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గంగమ్మ ఆలయంలో విశేష పూజలు



నెల్లూరు రూరల్: పడారుపల్లిలోని గంగమ్మ ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా సోమవారం విశేషాభిషేకాలు, పూజలు, హోమాలు నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా యాగ మండప దేవతా హోమం, నవగ్రహ మండపారాధన, మహామంగళ హారతి, హోమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వాటర్ కూలర్ల వితరణ



నెల్లూరు రూరల్: రూరల్ పరిధిలోని 27వ డివిజన్ చంద్రమౌళీనగర్‌లోని సచివాలయానికి విజయ డైయిరీ చైర్మన్ రంగారెడ్డి చేతుల మీదుగా సోమవారం వాటర్ కూలర్లను వితరణ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సన్నపురెడ్డి సుబ్బారెడ్డి, సన్నపురెడ్డి పెంచల్‌రెడ్డి, కమలాకర్‌రెడ్డి, ఏసునాయుడు, హరిబాబు యాదవ్, కోటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ స్థాయిలో కంటి వెలుగు

నెల్లూరు(అర్బన్): కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామ/వార్డు సచివాలయాల్లోనే డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ వెంకటప్రసాద్ తెలిపారు. సంతపేటలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్యాలతో కంటి వెలుగుపై సోమవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కంటివెలుగు కార్యక్రమాన్ని రూపొందించి అమలు చేస్తోందన్నారు. కంటి వెలుగు స్క్రీనింగ్ కోసం ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు పారామెడికల్ సిబ్బందిని కేటాయించాలని కోరారు. గతంలో కంటివెలుగు కార్యక్రమం కింద ఎన్‌జీవో ఆస్పత్రుల్లో చేసిన ఆపరేషన్ల వివరాలను త్వరితగతిన ఆన్‌లైన్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారి డాక్టర్ శార్వాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ వెంకటప్రసాద్

విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

నెల్లూరు రూరల్: గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యా వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్‌చక్రవర్తి పేర్కొన్నారు. మండలంలోని నాలుగు చోట్ల ఉన్న విద్యా కానుక స్టాక్ పాయింట్లను సోమవారం ఆయన సందర్శించారు. విద్యా కానుక కిట్‌లోని 8 రకాల వస్తువుల నాణ్యతను పరిశీలించారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా బడులు తెరిచే రోజే విద్యా కానుక కిట్లను విద్యార్థులకు అందించాలని సూచించారు. ఆయన వెంట సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఉషారాణి ఉన్నారు.



బెల్టు, బూట్ల నాణ్యతను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్‌చక్రవర్తి

సమస్యల పరిష్కారంలో జాప్యం చేయొద్దు

నెల్లూరు(బారకాసు): స్పందన కార్యక్రమంలో ప్రజలు విన్నవించే సమస్యల పరిష్కారంలో జాప్యం చేయొద్దని నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్‌మర్మత్ అధికారులను ఆదేశించారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన వేదికలో కమిషనర్ పాల్గొన్నారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమంలో భాగంగా ప్రజలు విన్నవించిన 12 ఫిర్యాదులను సంబంధిత విభాగాధికారులకు తెలియజేసి పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం స్పందనకు వచ్చిన నగర ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజల నుంచి 45 అర్జీలు రాగా నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం, 1902, స్పందన, ఏపీ సేవా పోర్టల్‌ను నగర పాలక సంస్థ అన్ని విభాగాల ఉన్నతాధికారులు ప్రతిరోజూ పరిశీలించుకోవాలని, ఫిర్యాదులు పెండింగ్‌లో లేకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. సచివాలయ స్థాయిలో పరిష్కరించాల్సిన సమస్యలను సంబంధిత కార్యదర్శులు పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు. నగర పాలక సంస్థ ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ వికాస్‌మర్మత్

లిఫ్ట్ ఇరిగేషన్ పనులు త్వరగా చేపట్టండి

• ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): ఉత్తరకాలువపై లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంలు ఏర్పాటుతో సోమశిల వరద జలాలతో మరో 5,566 ఎకరాలు సాగులోకి వచ్చే అవకాశం ఉంటుందని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన నెల్లూరులోని తన క్యాంప్ కార్యాలయంలో సోమశిల ప్రాజెక్ట్, ఏపీఎస్ఐడీసీ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తర కాలువ ద్వారా ఆత్మకూరు, అనంతసాగరం, మర్రిపాడు, ఏఎస్‌పేట మండలాల్లోని సుమారు 20 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తోందని తెలిపారు. ఇటీవల ప్రభుత్వం ఉత్తరకాలువ ఆధునీకరణ పనులు చేపట్టడంతో 772 క్యూసెక్కుల నుంచి 1540 క్యూసెక్కులకు నీటి విడుదల ప్రక్రియ పెరిగిందన్నారు. ఇందులో లిఫ్ట్ స్కీ కు 500, రాళ్లపాడు రిజర్వాయర్‌కు 450, చెరువులకు 590 క్యూసెక్కులను వినియోగించుకోవచ్చునని తెలిపారు. ఉత్తర కాలువపై అనంతసాగరం మండలం బొమ్మవరం, ఆత్మకూరు మండలం రామస్వామిపల్లి, ఆరవీడు, పమిడిపాడు, మర్రిపాడు మండలం ఖాన్‌సాహెబ్‌పేట, రామానాయుడుపల్లి లేదా వెన్నవాడ లేదా నందవరం, ఏఎస్‌పేట మండలం దూబగుంట, వింజమూరు, కలిగిరి మండలం తెల్లపాడు, కొండాపురం మండలం తూర్పుఎర్రబల్లి వద్ద ఉత్తరకాలువపై లిఫ్ట్ స్కీంల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సోమశిల ప్రాజెక్ట్ ఈఈ వెంకటరమణారెడ్డి, ఏపీఎస్ఐడీసీ డీఈఈ హజరత్తయ్య పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

బాధిత పోలీసు కుటుంబాలకు చెక్కుల పంపిణీ

నెల్లూరు(క్రైమ్): విధి నిర్వహణలో మృతి చెందిన పోలీసుల కుటుంబాలకు కార్పస్‌ఫండ్, విడో ఫండ్ చెక్కులను జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కే తిరుమలేశ్వరరెడ్డి సోమవారం అందజేశారు. ఇటీవల మృతి చెందిన డీపీఓ సీనియర్ అసిస్టెంట్ ఎస్ జయశంకర్ భార్య రూపావతికి కార్పస్ ఫండ్ కింద రూ.లక్ష చెక్కు అందజేశారు. అలాగే బుచ్చిరెడ్డిపాళెం కానిస్టేబుల్ మల్లికార్జున భార్య గీతాబాల, సోమశిల హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖర్ భార్య జయలక్ష్మి, ఆత్మకూరు సీఐ ఎం నాగేశ్వరరావు సతీమణి వెంకటలక్ష్మికి కార్పస్ ఫండ్ కింద రూ.లక్ష చొప్పున చెక్కులు అందజేశారు. అనంతసాగరం హెడ్‌కానిస్టేబుల్ పీ కరిముల్లాఖాన్ భార్య రెహనాకు విడో ఫండ్ కింద రూ.50వేల చెక్కు అందజేశారు. ప్రభుత్వం నుంచి రావల్సిన అన్ని సదుపాయాలు వెంటనే వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటామని, ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏఎస్పీ డీ హిమవతి, ఏఓ విజయకుమార్, పీ సెక్షన్ సూపరింటెండెంట్ శిరీషా, తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

నెల్లూరు రూరల్: నెల్లూరు రూరల్ పరిధిలోని 4వ మైలు ప్రాంతంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అబ్దుల్ సత్తార్ (73) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు రూరల్ పోలీసులు సోమవారం తెలిపారు. నగరంలోని వెంకటేశ్వరపురానికి చెందిన సత్తార్ 4వ మైలు సెంటర్లోని చికెన్ షాపులో పనిచేసేవాడు. గత నెల 28న షాపులో పనిముగించుకుని వెంకటేశ్వరపురానికి సైకిల్‌పై వెళుతుండగా వెనుకవైపు నుంచి మోటార్‌సైకిల్ వేగంగా ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన అబ్దుల్ సత్తార్‌ను కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అబ్దుల్ సత్తార్ మృతి చెందాడు. నగరంలోని జీజీహెచ్‌లో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.



అబ్దుల్ సత్తార్ మృతదేహం

'ఉపాధి'లో అక్రమాలకు పాల్పడితే చర్యలు

నెల్లూరు(పొగతోట): ఉపాధి హామీ పథకం పనుల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డ్వామా పీడీ వెంకటరావు ఉపాధి సిబ్బందిని హెచ్చరించారు. సోమవారం ఆయన డ్వామా కార్యాలయం నుంచి వివిధ మండలాల ఏపీఓలు, ఈసీలు, టీఏలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉపాధి పనులకు హాజరయ్యే కూలీల సంఖ్యను పెంచాలన్నారు. కూలీలకు దినసరి వేతనం అధికంగా వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. అందుకనుగుణంగా పనులు కల్పించాలన్నారు. ఉపాధి సిబ్బంది ప్రతిరోజూ నాలుగు గంటల పాటు క్షేత్రస్థాయిలో పర్యటించి కూలీలకు పనులు కల్పించాలన్నారు. కూలీలు చేసిన పనులకు సంబంధించి కొలతలు తీసుకుని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి



నెల్లూరు(క్రైమ్): ఇందిరాభవన్ గోడ వద్ద సోమవారం గుర్తుతెలియని వ్యక్తి(40) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతుడి నోరు, ముక్కు నుంచి తీవ్ర రక్తస్రావమై ఉంది. స్థానికులు గమనించిన వీఆర్వో శిరీషాకు సమాచారం అందించారు. ఆమె ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇందిరాభవన్ గోడకున్న ఫెన్సింగ్‌ను దాటేందుకు యత్నించి గోడపై నుంచి కిందపడి మృతి చెంది ఉండవచ్చని ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతదేహాన్ని చిన్నబజారు ఎస్సై సైదులు పరిశీలించి జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడి వివరాల కోసం ఆరాతీయగా భిక్షగాడై ఉండవచ్చని స్థానికులు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు చిన్నబజారు స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

గడ్డివాములు దగ్ధం

వెంకటాచలం: అనికేపల్లిలో ఆరు గడ్డివాములు సోమవారం దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన రవీంద్ర, కిరణ్, గుండుబోయిన బుజ్జమ్మ, పుట్టయ్య, మరో ఇద్దరు రైతులకు చెందిన గడ్డివాములు పక్కపక్కనే ఉన్నాయి. సోమవారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకునే సరికే ఆరు గడ్డివాములు పూర్తిగా కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది ఇతర గడ్డివాములకు మంటలు వ్యాప్తి చెందకుండా అదుపు చేశారు. గడ్డివాములు కాలిపోవడానికి కారణాలు తెలియలేదని స్థానికులు చెబుతున్నారు. రూ.2 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు వాపోతున్నారు.